"ఉత్తిష్ఠత! జాగృత! ప్రాప్యవరాన్నిబోధత"

కలియుగాబ్ది 5128

# హిందూ నగారా

మాసపత్రిక

సంపుటి 34 ❁ సంచిక : 07 ❁ శ్రీ పరాభవ నామ సంవత్సరం ❁ జ్యేష్ఠ మాసం ❁ జులై 2026 ❁ పేజీలు : 16 ❁ విడిప్రతి : రూ 10



# అన్ని సవాళ్లకు పరిష్కారాలు భారత్ దృక్పథంలోనే ఉన్నాయి

## ఆరెస్సెస్ సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్

నేడు ప్రపంచం అన్వేషిస్తున్న అనేక సవాళ్లకు పరిష్కారాలన్నీ భారత్ దృక్పథంలోనే ఉన్నాయని ఆరెస్సెస్ సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్ పునరుద్ఘాటించారు. ప్రస్తుతం ప్రపంచ స్థాయి విధానాలన్నీ పాక్షికమైన దృక్పథాలనే అందిస్తున్నాయని, అందుకే అవి ఈ కాలపు సవాళ్లను పరిష్కరించలేవని పేర్కొన్నారు. ఎన్.ఇ.పి.-2020 అమలు - భారతీయ జ్ఞాన వ్యవస్థల అనుసంధానం అంశంపై 'భారతీయ శిక్షణ మండలి' ఆధ్వర్యంలో బెంగళూరులోని 'ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇంటర్నేషనల్ సెంటర్'లో జూన్ 26 నుంచి 28 వరకు జరిగిన జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి మోహన్ భాగవత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సమస్త జీవరాశి శ్రేయస్సు కోసం, సమగ్ర దృక్పథం ఆధారంగా విషయాలను పరిపూర్ణం చేయడంలో భారత్ తన గళం వినిపించడం అత్యావశ్యకమని నొక్కి చెప్పారు. భారతీయ శిక్షణ మండలి చేస్తున్న కృషిని ఒక బృహత్తర నాగరికతా లక్ష్యంలో భాగమని అభివర్ణిస్తూ, వాస్తవానికి.. ప్రపంచానికి పరిపూర్ణతను చేకూర్చడమే మా పని అని ఆయన స్పష్టం చేశారు. భారతీయ దృక్పథాలను ఆయన వివరిస్తూ, ఇతర దృక్పథాలను తప్పుగా పరిగణించమని తెలిపారు. ప్రజలందరూ తమ సొంత జీవితానుభవాల నుంచి తమ దృక్పథాలను ఏర్పర్చుకుంటారని, వాటికంటూ ఓ ప్రామాణికత ఉంటుందని చెప్పారు. అనేకత సూత్రం ద్వారా, వైవిధ్యాన్ని స్వీకరించే భారతీయ దృక్పథం అటువంటి అనుభవాలన్నింటినీ




స్వాగతిస్తుందన్నారు. సత్యం అనేది ఏ ఒక్క దృక్కోణంలోనూ పూర్తిగా ఇమడలేనంత విశాలమైనదని, ప్రతి అభిప్రాయం నుంచి సారాన్ని గ్రహించడానికి వాదన మార్గం కాదని తెలిపారు. శాస్త్రం అంటే పాండిత్య సంభాషణే అని ఇది గుర్తిస్తుందని, ఇతరుల దృక్కోణాలు అసంపూర్ణంగా ఉన్నచోట భారతీయ దృక్కోణాలు సంపూర్ణంగా ఉంటాయని, ఈ సంపూర్ణత కోసం భారత్ వాణిని వినాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, భారతీయ శిక్షణ మండలి కొత్త వెబ్‌సైట్‌ను డాక్టర్ మోహన్ భాగవత్ ప్రారంభించారు. ఇది బీఎస్ఎం డిజిటల్ పరిధిని విస్తరించడంలో, భారతీయ విద్య పట్ల దానికున్న ఆశయాన్ని దేశవ్యాప్తంగా, వెలుపల ఉన్న విద్యావేత్తలు, పండితులు, పౌరులకు మరింత అందుబాటులోకి తీసుకురావడంలో ఒక ముఖ్యమైన ముందడుగు అని అన్నారు.







## కాకినాడలో నచికేత విద్యార్థుల ఉచిత ఆవాస భవన గృహప్రవేశం

కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట పంచాయితీ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో సేవా భారతి - కాకినాడ సంస్థ నిర్వహిస్తున్న నచికేత విద్యార్థుల ఉచిత ఆవాసం కోసం ఏర్పాటు చేసిన నూతన భవన ప్రారంభోత్సవం జరిగినది. 2022 జూన్‌లో ప్రారంభించిన నచికేత ఆవాసాన్ని ఇప్పటి వరకూ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. 40 మంది పేద విద్యార్థులు ఉంటున్న ఈ ఆవాసాన్ని పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు వాస్తవ్యులు, విశ్రాంత అధ్యాపకులు శ్రీ కొంపెల్ల లక్ష్మీరామకృష్ణమూర్తి, వీరి కుమార్తె మెహర్ కాంతి ఇటీవల సందర్శించారు. సేవా భారతి సేవలకు ప్రభావితులై రమణయ్యపేట ఎఫ్‌సీఐ కాలనీలో వారికున్న మూడు అంతస్తుల భవనాన్ని నచికేత ఆవాసం కోసం విరాళంగా ఇచ్చారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి ఈ భవనాన్ని ప్రారంభించారు. సేవా భారతి వారు నిర్వహిస్తున్న నచికేత ఆవాసం విద్యార్థులు చక్కటి క్రమశిక్షణ కలిగి విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తున్నారని కొనియాడారు. ఆర్ఎస్ఎస్ క్షేత్ర సేవా ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్ ముఖ్య వక్తగా పాల్గొన్నారు.

# గురువులకు పుట్టినిల్లు భారత భూమి

ఆహార, నిద్ర, భయ, మైథునాలు సమస్త జీవరాశులకీ ఉన్నాయి. ఒక్క మనిషికి మాత్రమే బుద్ధి అనే విశేష సౌలభ్యం ఉంది. దానిని సంపూర్ణంగా అవతరింపజేసుకున్న వ్యక్తి మనుష్యత్వం నుంచి దైవత్వానికి ఎదగవచ్చునని సనాతన ధర్మం చెబుతుంది. అయితే ఈ ఎదుగుదలకి తోడ్పడేది ఒక్క గురువు మాత్రమే. జ్ఞాన భూమి అయిన ఈ భారత జాతి అందుకే గురువులకి నతమస్తకమై నడయాడింది. జన్మ, కర్మలను అనుసరించి గురువులను ఆశ్రయించి తరించింది ఈ భారత జాతి. మానవత్వం పరిమళించి మంచి మనిషిగా వ్యక్తి ఎదగటానికి 'గురువుల మాల'ని మనకు అందించింది సనాతన ధర్మం. వ్యక్తి జీవితంలో సంభవించే వివిధ దశలకు మార్గదర్శనం చేసే గురువుల వ్యవస్థ మనకు సనాతనధర్మంలో ఉన్నది.



**సూచక గురువు:** అకారాది అక్షర జ్ఞానం మొదలుకొని లౌకికమయిన సమస్త బాహ్య శాస్త్రాలను అభ్యసింపచేసే గురువులను సూచక గురువులంటారు.

**వాచక గురువు:** వర్ణాశ్రమాలకు చెందిన ధర్మాధర్మాలని తెలిపి, వ్యక్తులను స్వధర్మాచరణకు కటిబద్ధులను చేసే మార్గదర్శకులను వాచక గురువులంటారు. కుల సంప్రదాయాలు అంటే ఇంట్లో జరిగే వివాహాది వేడుకలు, మరణాది అంత్యేష్టి కార్యక్రమాలు ఎలా జరగాలో నిర్దేశించేది వారు వీరు.

**బోధక గురువు:** యోగ్యతను అనుసరించి జీవనశైలిని చక్కదిద్దటానికి పంచాక్షరాది మంత్రాలను జప, అనుష్ఠానాల కోసం ఉపదేశించే వారిని బోధక గురువులంటారు.

**నిషిద్ధ గురువు:** క్షుద్రమయిన, క్షణికమయిన కోరికలను తీర్చుకోవటానికి నీచ మంత్రాదులను ఉపదేశించే గురువులను నిషిద్ధ గురువులు అంటారు. వీరికి కూడా గురుమాలికలో స్థానం కల్పించిన ఉదారత భారతీయ సంస్కృతిది.

**విహిత గురువు:** సంసారం సమస్త సంకటాలకు నిలయమని, ఇది అనిత్యమని నిరూపించి దానిపై వైరాగ్య జ్ఞానాన్ని కలుగజేసి ఉద్ధరింపజేసే వారిని విహిత గురువులంటారు.

**కారణ గురువు:** ఉపనిషత్ వాక్యాలయిన 'తత్త్వమసి, అహం బ్రహ్మాస్మి.....' ఇత్యాది బ్రహ్మోపదేశ వాక్యాలను ఉపదేశించి, భవరోగ తిమిరాలని నివారింపచేసేవారు కారణ గురువులు.

**పరమ గురువు:** సందేహాలనన్నింటినీ కూకటి వేళ్ళతో పెకలించి, జనన మరణ భయాన్ని నివర్తింపజేసి, పరమ శాంతిని అనుభూతికి తెచ్చే గురువులను పరమ గురువులుగా పూజలు అందుకుంటారు. ఇంతటి సుభిక్షమయిన గురు వ్యవస్థ వర్ధిల్లిన కారణంతోనే భారత భూమి విశ్వానికి గురువు కాగలిగింది.

**సదాశివ సమారంభాం వ్యాస శంకర మధ్యమాం ।**
**అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం ॥**

## విశ్వవిద్యాలయాలలో ఆచార్యులకు ఉండాల్సిన లక్షణాలు

ఆచార్యుడు కావడానికి మూడు అర్హతలుండాలి అని భారతీయ సనాతన ధర్మం చెబుతుంది. అవి..

**1. ఆచినోతిహి శాస్త్రార్థం:** విషయం బాగా తెలిసి ఉండాలి.

**2. స్వయం ఆచరతే:** తెలిసినదానిని ఆచరణలో పెట్టాలి.

**3. ఆచారే స్థాపయతి:** విద్యార్థులు తమ జీవితంలోనూ ఆచరించేలా చేయాలి. కేవలం విషయం తెలిస్తే అతను విద్వాంసుడు మాత్రమే అవుతాడు. అతనికి ఆచార్య స్థానం లేదు. ఇక శాస్త్రార్థాన్ని అనుభవించేవాడు కేవలం అనుభావి. అతడికీ ఆచార్య స్థానం దక్కదు. తన జీవితాన్ని ఇతరులకు ఆదర్శ ప్రాయంగా ఉండేట్లు తనను తాను తీర్చిదిద్దుకోలేనివాడు ప్రచారకుడే కానీ ఆచార్యుడు కాలేడు. ప్రతి ఆచార్యునిలోనూ ఈ 3 లక్షణాలు కచ్చితంగా ఉండాలి. అంటే అనుష్ఠాత, అనుభవి, ప్రచారకుడు అయి ఉండేవాడే ఆచార్యుడు. ఇలాంటి విశిష్ట లక్షణాలు కలిగిన ఆచార్యులున్న కారణంతోనే భారతదేశం విశ్వానికి గురువు కాగలిగింది. నేడు మన విశ్వవిద్యాలయాలలో ఉన్న ఆచార్యుల్లో అధిక శాతం దిగజారిన వ్యక్తిత్వం కలిగిన అజ్ఞానులే. దీనికితోడు కేంద్ర, రాష్ట్ర పాలకుల నిర్లక్ష్య వైఖరి విద్యా వ్యవస్థల పాలిట శాపంగా పరిణమిస్తున్నది. ఇది స్వయంగా తను కూర్చున్న చెట్టు కొమ్మని తానే నరుక్కోవటం లాంటి ఘాతుకంతో సమానం అని చెప్పవచ్చు. విశ్వగురుత్వం మాట దేవుడెరుగు, దేశద్రోహులను నిర్మాణంచేసే పారసైట్లు కూడా ఆచార్య పీఠాలను అధివసించి యథేచ్ఛగా తిరుగుతున్నారు. మన పాలకులకు పరమేశ్వరుడు సరైన బుద్ధిని ప్రసాదించాలని వేడుకుందాం!


## ఇలా అన్నారు...



దేశంలోని ఆలయాల నిర్వహణ, భద్రత, ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణ కోసం ఒక స్వతంత్ర సనాతన సంరక్షణ మండలి లేదా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలి. పూజా విధానాలు, ఆగమ శాస్త్రాలు, సంప్రదాయాలు, ధార్మిక పరిపాలన వంటి అంశాలపై అవగాహన ఉన్నవారే ఆలయ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించగలరు.

**– శంకరాచార్య స్వామి సదానంద సరస్వతి మహారాజ్, ద్వారకా శారదా పీఠం**

# గాంధీజీ కూర్చున్న పవిత్ర స్థలం




**ఆం**గ్లేయుల సామ్రాజ్యానికి వ్యతిరేకంగా శాంతియుత పోరాటం చేపట్టడానికి, ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడానికి వీలుగా గాంధీజీ దేశమంతా పర్యటించేవారు. దీనిలో భాగంగా 1921 అక్టోబరు 1న ఆయన బళ్ళారి చేరుకున్నారు. అప్పటికే ఆ ప్రాంతంలో స్వాతంత్ర్య సమయం జోరుగా సాగుతోంది. గాంధీజీ రాకను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్‌లోని రెండు వర్గాలు వేర్వేరు సభలు ఏర్పాటు చేశాయి. మహాత్ముడిని ఆహ్వానించడానికి రెండు వర్గాల్లోని ప్రముఖులు బళ్ళారి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. తీరా ఆయన వచ్చిన తర్వాత తొలుత తమ సభకే రావాలని ఎవరికి వారు పట్టుబట్టారు. 'విభజించి పాలించు' నినాదంతో రాజ్యమేలుతున్న ఆంగ్లేయులను దేశం నుంచి పారద్రోలేందుకు సంఘటితులమై పోరాడాల్సిన మనం ఈ విధంగా విడిపోయి అనైక్యతను చాటడం ఏమిటని గాంధీజీ ఎంతో మధనపడ్డారు. తాను ఎవరి సభకూ రావడం లేదని స్పష్టం చేశారు. మరో రైలు వచ్చేవరకూ అంటే.. దాదాపు ఎనిమిది గంటల పాటు బళ్ళారి రైల్వే స్టేషన్‌లోనే బైఠాయించారు. అక్కడ ఆయన కూర్చున్న స్థలానికి 'పవిత్ర స్థలం' అనే గుర్తింపు లభించింది. తర్వాత కాలంలో అక్కడ రెండు వర్గాలూ కలిసి సమిష్టిగా ఉద్యమాన్ని నడుపుతున్నాయని తెలుసుకున్న గాంధీజీ 1934లో బళ్ళారిని సందర్శించి, ఉపన్యసించారు.

# మానవ రూపంలో కొలువైన మహేశ్వరుడు

**సా**ధారణంగా పరమశివుడు అన్ని ఆలయాల్లో లింగాకారంలోనే దర్శనమిస్తాడు. అయితే హేమావతి సిద్దేశ్వరస్వామి ఆలయంలో మాత్రం మనిషి ఆకారంలో స్వామి దర్శనమిస్తారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరకు సమీపంలో అమరాపురం మండలం హేమావతి గ్రామంలో కొలువైన ఈ పంచలింగాల క్షేత్రం హేమావతి సిద్దేశ్వరస్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. స్వామి నిలువెత్తు రూపంతో పాటు మరో నాలుగు శివలింగాలు కొలువైన ఈ క్షేత్రానికి వందల సంవత్సరాల చరిత్ర ఉన్నట్లుగా తెలుస్తోంది. అతి ప్రాచీన నిర్మాణ శైలితో, అబ్బురపరిచే శిల్పకళా నైపుణ్యంతో దాదాపు 15 ఎకరాల సువిశాల ప్రాంగణంలో వెలసిన ఈ ఆలయం దేశంలోని అరుదైన శైవ క్షేత్రాల్లో ఒకటి. ఇక్కడ శివుడు సిద్ధయోగిగా దర్శనమివ్వడం విశేషం. పూర్వం ఈ ప్రాంతంలో హేమావతి నది ప్రవహించేదని అంటారు. **ఇక్కడి గర్భాలయంలో శివుడు సుమారు 5.8 అడుగుల ఎత్తులో పానవట్టంపై పశ్చిమాభిముఖంగా కూర్చుని, చతుర్భుజుడిగా దర్శనమిస్తాడు. అభయముద్ర, త్రిశూలం, ఢమరుకం, భిక్షాపాత్ర ధరించి భక్తులను అనుగ్రహిస్తుంటాడు.**



స్వామి శిరసుపై సూర్యచంద్రులు స్పష్టంగా గోచరిస్తారు. సిద్దేశ్వరుడిని దర్శనం అనంతరం ఇదే ప్రాంగణంలో ఉన్న మూడు శివాలయాలను, ఆలయ ప్రాంగణం వెలుపల ఉన్న శివాలయాన్ని భక్తులు దర్శించుకుంటారు. **దొడ్డేశ్వర, సోమేశ్వర, మల్లేశ్వర, విరూపాక్షేశ్వర అనే పేర్లతో వెలసిన ఈ నాలుగు శివలింగాలకు బ్రహ్మసూత్రం ఉండడం విశేషం. బ్రహ్మదేవుడే ఈ లింగాలకు యజ్ఞోపవీతాన్ని బ్రహ్మసూత్రంగా అలంకరించాడని, ఇలాంటి అరుదైన శివలింగాలు మరెక్కడా లేవని చెబుతారు.** ఆలయ ప్రాంగణంలో ఉన్న పవిత్ర పుష్కరిణికి కళ్యాణి బావి అని పేరు. ఈ పుష్కరిణిలోని పవిత్ర జలాలకు సర్వ రోగాలను నివారించే శక్తి ఉందని విశ్వాసం. **చైత్ర, వైశాఖ మాసాల్లో స్వామివారి మూలమూర్తి శిరసుపై సూర్యకిరణాలు పడే అద్భుత దృశ్యాన్ని వీక్షించడానికి భక్తులు విశేషంగా తరలి వస్తారు. అలాగే ఇక్కడున్న నంది విగ్రహాలను చేతితో తడితే లోహపు శబ్దం రావడం విచిత్రం.** సంతాన ప్రదాతగా ప్రసిద్ధి చెందిన సిద్దేశ్వర స్వామికి మహాశివరాత్రి సమయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలలో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారు.

# సోంపుతో జీర్ణక్రియ పదిలం

మన ఇళ్లలో, హోటళ్ళలో వాడే సుగంధ ద్రవ్యం సోంపు. రోజూ భోజనం తర్వాత ఒక స్పూన్ సోంపు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరాన్ని తగ్గించి, ఆహారం త్వరగా అరిగేలా చేస్తుంది. సోంపులో ఉండే కార్మినేటివ్ గుణాలు, ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. సోంపు గింజల చూర్ణం ఒక భాగం, అతిమధురం చూర్ణం 2 భాగాలు, పటిక బెల్లం పొడి 3భాగాలు కలిపి రోజూ రెండుసార్లు ఒక చెంచా తీసుకుంటే దగ్గు, ఆయాసం తగ్గుతాయి. నేతితో వేయించిన సోంపు చూర్ణం, సమభాగము కలకండ పొడి కలిపి నీరు అనుపానముగా తీసుకొంటే మూత్రంలో మంట తగ్గుతుంది. శొంఠి, సునాముఖి, సోంపు, సైంధవ లవణం, శివ (కరక్కాయల పొడి) సమానంగా చూర్ణం చేసిన 'పంచ సకార చూర్ణం' ఒక చెంచా ప్రమాణంలో రాత్రి, ఉదయం ఆహారం తర్వాత గోరువెచ్చని నీటిలో తీసుకుంటే మలబద్ధకం, పులి త్రేపులు, కీళ్ళ నొప్పులు తగ్గుతాయి. పోత పాలు, డబ్బా పాలు



తాగే పిల్లలకు సోంపు, ఎండించిన పుదీనా ఆకుల చూర్ణం సమభాగం తీసుకుని తేనెతో ఇస్తే అజీర్ణ సమస్యలు తగ్గుతాయి. సోంపు, పసుపు చూర్ణాలు కలిపి 2 గ్లాసుల్లో రెండు చెంచాలు వేసి అర్ధభాగం మిగిలేలా కాచి వడగట్టి తాగితే జంతువులు కరవడం వల్ల వచ్చే విషం హరిస్తుంది. సోంపు, నల్లఉప్పు సమ భాగం చూర్ణించి అర చెంచా ప్రమాణంలో రెండు పూటలా వాడితే కడుపు నొప్పి తగ్గుతుంది. సోంపు, ధనియాలు, ఏలకులు, సీమబాదం పప్పు, పటిక బెల్లం సమభాగం కలిపి చూర్ణించి రోజు రాత్రి ఒక స్పూన్ పొడిని పాలలో కలిపి తీసుకొంటే మతిమరుపు తగ్గి జ్ఞాపక శక్తి పెరుగుతుంది. కళ్ళ మంటలు తగ్గుతాయి.

# డ్రైనేజీలో చెత్త ఎత్తివేసే పరికరం

నగరాలలో పారిశుధ్య కార్మికులు మురికి కాలువలలోకి దిగి తమ చేతులతో చెత్తను తీస్తుంటారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి యంత్రాలు కొనుగోలు చేసినా ఈ పరిస్థితిలో మార్పు రావడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని తక్కువ శ్రమతో, సులభంగా వ్యర్థాలను తొలగించే విధంగా పర్యావరణ హితమైన పరికరాన్ని తయారు చేశారు. మురికి కాలువలో చెత్త, ఇతర వ్యర్థాలపై ఈ పరికరం ఉంచి, పైన ఉన్న రాడ్ సహాయంతో వెడల్పు చేసి చెత్తను లోనికి



తీసుకొని, పైకి తీసి బయట పడవేయవచ్చు. అదేవిధంగా రోడ్డు మీద చెత్తను కూడా చేతితో తీసే పని లేకుండా కూడా తొలగించగలము. ఇంకా రోడ్డుమీద పడవేసిన ప్లాస్టిక్ బాటిళ్లు తదితర వ్యర్థాలను కూడా ఈ పరికరం ద్వారా తీయవచ్చు. దీనికోసం అర్ధ చక్రాకారంలో ఉన్న రెండు ఐరన్ ప్లేట్లు సిద్ధం చేసుకోవాలి. ఒక ఐరన్ రాడ్‌కు ముందుకు, వెనకకు వచ్చే విధంగా స్ప్రింగ్ సహాయంతో అమర్చాలి. పైన రాడ్‌ను రెసిప్రొకేటింగ్ సిస్టమ్‌కు అటాచ్ చేశారు. మెకానికల్ ఇంజనీరింగ్ సూత్రాల ఆధారంగా తయారు చేసిన ఈ పరికరానికి పేటెంట్ హక్కు కోసం దరఖాస్తు చేశారు. పట్టణ, పల్లె ప్రాంతాల ప్రజలు, వైద్యశాలలు, హోటళ్లు, పశువుల పాకల దగ్గర ఈ పరికరం బాగా ఉపయోగపడుతుంది. ఆసక్తి ఉన్న వారు శ్రీ ఆంజనేయ స్మాల్ అగ్రి టూల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ముప్పా లక్ష్మణరావు (సెల్ నం.9849140465)ను సంప్రదించవచ్చు.

### ఈ నెల శ్లోకము



**పరోపి హితవాన్ బంధుః బంధురప్యహితో పరః ।**
**అహితద్దేహజర్వ్యాధిః హితోరరణ్యమౌషధం ॥**


**భావము:** పరుడైనా హితం కోరేవాడు బంధువు. బంధువైనా అహితం కోరేవాడు పరుడు. అహితుడు శరీరం లోని వ్యాధివంటి వాడు. హితుడు అరణ్యంలో లభించే ఔషధం వంటివాడు. మన మంచిని, శ్రేయస్సును సదా కాంక్షించే వారు, కష్ట సమయాలలో సహాయ సహకారాలు అందించి ఆదుకునేవారే నిజమైన బంధువులు, హితులు.

### హిందూ నగారా పాఠకులకు విజ్ఞప్తి

హిందూ నగారాలో ప్రచురించబడుతున్న వార్తలు, వ్యాసాలపై మీ అభిప్రాయాలను ఈ క్రింది ఫోన్ నెంబరుకు వాట్సప్ ద్వారా కానీ, ఫోన్ చేసి కానీ తెలుపవచ్చు. అలాగే మీ మీ ప్రాంతాలలో జరిగే హిందుత్వ ప్రాధాన్యత కలిగిన సంఘటనలను కూడా మాకు తెలియపరచవచ్చు.

మీరు ఫోన్ / వాట్సప్ చెయ్యవలసిన నెంబర్ : 8333812685


# సర్జరీ పితామహుడు సుశ్రుతుడి కాంస్య విగ్రహావిష్కరణ



ఆధునిక ప్లాస్టిక్ సర్జరీకి ఆద్యుడు, శస్త్రచికిత్స పితామహుడు మహర్షి సుశ్రుతుడి 90 కిలోల కాంస్య విగ్రహాన్ని యూకేలో ఆవిష్కరించారు. 1505లో స్థాపించిన ప్రపంచంలోనే మొట్టమొదటి, అతిపెద్ద శస్త్రచికిత్స సంస్థగా (140కి పైగా దేశాల్లో 33,000 మందికి పైగా సభ్యులతో) పేరుగాంచిన 'రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఎడిన్‌బర్గ్'లో మహర్షి సుశ్రుతుడి కాంస్య విగ్రహాన్ని 'ప్లేఫెయిర్ ఆడిటోరియం'లో ఆవిష్కరించారు. తెలుగు మూలాలున్న యూకే శస్త్రచికిత్స నిపుణుడు ప్రొ. చంద్ర చెరువు (ఎఫ్ఆర్‌సీఎస్) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయన కృషి ఫలితంగా నేడు ప్రపంచం మొత్తం మహర్షి సుశ్రుతుడిని 'శస్త్రచికిత్స పితామహుడు'గా ఏకగ్రీవంగా అంగీకరిస్తోంది. ఈ విగ్రహాన్ని చంద్ర, ఆయన కుటుంబం స్థాపించిన 'చెరువు ఫ్యామిలీ ఫౌండేషన్' విరాళంగా ఇచ్చింది. దీనిని తమిళనాడులోని తిరువణ్ణామలైకి చెందిన ఓ శిల్పి రూపొందించారు. సుశ్రుత విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రొఫెసర్ చెరువు "మహర్షి సుశ్రుత: ఎ కంపెండియం – ఫాదర్ ఆఫ్ సర్జరీ" అనే పేరుతో 280 పేజీల సమగ్రమైన, ఆధారాలతో కూడిన పుస్తకాన్ని తయారు చేసి విడుదల చేశారు. విగ్రహాన్ని, ఈ పుస్తకాన్ని స్వీకరించడం ద్వారా మహర్షి సుశ్రుతుడు నిజమైన 'శస్త్రచికిత్స పితామహుడు' అని 'రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఎడిన్‌బర్గ్' ప్రపంచానికి చాటిచెప్పింది. భారతదేశానికి చెందిన మహర్షి సుశ్రుతుడు ప్రపంచంలోనే తొలి శస్త్రచికిత్స నిపుణుడు. సుమారు 2,600 సంవత్సరాల క్రితమే ఆయన 300కి పైగా శస్త్రచికిత్సలు చేశారు. 124 రకాల శస్త్రచికిత్స పరికరాలను ఆవిష్కరించారు. ఈ విజ్ఞానాన్ని భావి తరాలకు అందించే ఉద్దేశంతో ప్రపంచంలోనే మొట్టమొదటి శస్త్రచికిత్స గ్రంథమైన 'సుశ్రుత సంహిత'ను రచించారు. ఆధునిక ప్లాస్టిక్ సర్జరీకి చాలా కాలం ముందే సుశ్రుతుడు నుదుటి చర్మపు పొరలను ఉపయోగించి నాసికా పునర్నిర్మాణం చేపట్టారు. ఆధునిక ప్రపంచంలో వైద్య నీతి నియమబద్ధం కావడానికి చాలా కాలం ముందే శస్త్రచికిత్స శిక్షణ, వైద్య క్రమశిక్షణ, నీతికి సంబంధించిన సూత్రాలను నిర్దేశించారు. దివంగత డాక్టర్ సి.ఎస్. శాస్త్రి (ఎంఎస్) కుమారుడే ప్రొఫెసర్ చంద్ర చెరువు. వీరి కుటుంబం తెనాలి సమీపంలోని పెరవలి గ్రామానికి చెందినది. ఈ గ్రామంలో ఆరు శతాబ్దాలకు పైగా ప్రజలకు ఉచిత మూలికా వైద్య సేవలను అందిస్తోంది.

## శాకాహార నగరంగా వారణాసి

సనాతన ధర్మానికి ఆధ్యాత్మిక రాజధానిగా పేరొందిన కాశీ (వారణాసి) త్వరలో శాకాహార నగరంగా మారనుంది. నగర పవిత్రత, పరిశుభ్రత పరిరక్షణ లక్ష్యంగా వారణాసి మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) నగర పరిధిలోని మాంసం, చేపలు, కోళ్ల దుకాణాలను శివారు ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించింది.



ఈ నిర్ణయం ప్రకారం నగరంలోని సుమారు 350 నుంచి 400 మాంసం దుకాణాలను రానున్న ఆరు నెలల్లో విడతల వారీగా, దీపావళి నాటికి నగర శివార్లకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ చర్య అమలైతే కాశీ దేశంలో రెండో శాకాహార నగరంగా గుర్తింపు పొందనుంది. ప్రస్తుతం గుజరాత్‌లోని పాలితానా మాత్రమే పూర్తి శాకాహార పట్టణంగా గుర్తింపు పొందింది. అక్కడ 2014 నుంచే మాంసం, చేపలు, గుడ్ల విక్రయాలపై నిషేధం అమల్లో ఉంది.

## తిరుపతిలో జాతీయ శాసనాల మ్యూజియం

తిరుపతిలో జాతీయ శాసనాల మ్యూజియం ఏర్పాటు కానుంది. దీనికోసం రెండు ఎకరాల భూమిని కేటాయించేందుకు టీటీడీ సూత్రప్రాయంగా అంగీకరించింది. టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర, ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, కార్యదర్శి వివేక్, భారత



పురావస్తు సర్వే డైరెక్టర్ జనరల్ యదువీర్ సింగ్ మధ్య ఇటీవల జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. భారతదేశపు వేల సంవత్సరాల శాసన వారసత్వాన్ని పరిరక్షించేందుకు, పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా ఈ మ్యూజియంను తీర్చిదిద్దనున్నట్లు ఏఎస్ఐ డైరెక్టర్ (ఎపిగ్రఫీ) కె. మునిరత్నం రెడ్డి తెలిపారు. ఈ మ్యూజియంలో అరుదైన శిలా, రాగి ఫలక శాసనాలతో పాటు, పురాతన భారత చరిత్రను వివరించే ఫోటో మ్యూరల్స్, ఇంటరాక్టివ్ కియోస్క్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.

## షికాగోలో వివేకానందుడి విగ్రహావిష్కరణ



**అ**మెరికాలోని షికాగో నగరంలో ఉన్న భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో స్వామి వివేకానందుడి విగ్రహాన్ని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా ఆవిష్కరించారు. భారతీయ ఆధ్యాత్మికత, సనాతన ధర్మ సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహనీయుడు వివేకానందుడికి ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఈ విగ్రహం ప్రవాస భారతీయుల సహకారంతో కానుకగా ఏర్పాటు చేసినట్లు క్వాత్రా తెలిపారు. విగ్రహావిష్కరణ అనంతరం ఆయన సామాజిక మాధ్యమాల్లో స్పందిస్తూ, “స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో గర్వకారణం. మా ప్రవాస భారతీయుల నుంచి అందిన ఈ అమూల్యమైన కానుక ఆయనపై ఉన్న భక్తి, గౌరవానికి నిదర్శనం. సేవ, సామరస్యత, మానవతా విలువలపై స్వామిజీ అందించిన సందేశం నేటికీ మనందరికీ స్ఫూర్తినిస్తోంది” అని పేర్కొన్నారు. ప్రపంచ మత మహాసభలో హిందూ ధర్మ వైభవాన్ని చాటిచెప్పిన వివేకానందుడి స్ఫూర్తి భారతీయ యువతకు మార్గదర్శకంగా నిలుస్తోందని, ఆయన ఆలోచనలు విశ్వమానవ సంక్షేమానికి దిక్సూచిగా కొనసాగుతున్నాయని పలువురు ప్రవాస భారతీయులు అభిప్రాయపడ్డారు. షికాగోలో స్వామి వివేకానందుడి విగ్రహం ఏర్పాటు కావడం భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ సందేశం ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించడానికి దోహదపడుతుందని భారతీయ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

**చందాదారులుగా చేరండి! చేర్పించండి**
**హిందూ నగారా సంవత్సర చందా రూ. 100/-**
**మీతో పాటుగా మరి కొంతమందిని**
**చందాదారులుగా చేర్పించండి.**

**UNION BANK OF INDIA**
**A/C No. 014511100004775**
**IFSC CODE: UBIN0801453**
**Governorpet Branch,**
**VIJAYAWADA**

## గోమూత్రంతో చికున్ గున్యాకు చెక్!

**భా**రతీయ సాంప్రదాయ జ్ఞానం, ఆధునిక శాస్త్రీయ పరిశోధనల సమన్వయానికి మరో ఉదాహరణగా నిలిచే ఆసక్తికర ఫలితాలను ఐఐటీ రూర్కీ పరిశోధకులు వెల్లడించారు. ఐఐటీ రూర్కీకి చెందిన బయో సైన్సెస్, బయో ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ షైలీ తోమర్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం నిర్వహించిన పరిశోధనలో భాగంగా గోమూత్రం నుంచి తయారు చేసిన ప్రత్యేక సంయోగాలు చికున్‌గున్యా వైరస్ వ్యాప్తిని అడ్డుకునే సామర్థ్యాన్ని ప్రదర్శించినట్లు గుర్తించారు. సంప్రదాయ నివారణ పద్ధతులను ఆధునిక శాస్త్ర దృష్టితో అధ్యయనం చేయాలనే ఆసక్తి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న తరుణంలో ఈ పరిశోధన ప్రాముఖ్యత సంతరించుకుంది.




భవిష్యత్తులో మరిన్ని క్లినికల్ అధ్యయనాలు, వైద్యపరమైన పరీక్షల ద్వారా ఈ ఫలితాలను నిర్ధారించాల్సి ఉందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. భారతీయ సంస్కృతిలో గోమాతకు ఉన్న విశిష్ట స్థానం, గో ఉత్పత్తులపై పురాతన గ్రంథాల్లో ఉన్న ప్రస్తావనల నేపథ్యంలో ఈ పరిశోధనకు ప్రత్యేక ప్రాధాన్యం లభిస్తోంది. అయితే వైద్యుల సలహా లేకుండా చికిత్సా విధానాలుగా వీటిని వినియోగించరాదని ప్రజలకు నిపుణులు సూచిస్తున్నారు.

### ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పాఠశాలల్లో

## గాయత్రీ మంత్రం తప్పనిసరి

**భా**రతీయ సాంస్కృతిక విలువలను విద్యార్థులకు చేరవేయాలనే లక్ష్యంతో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026–27 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ గీతం, జాతీయ గేయంతో పాటు ప్రతిరోజూ గాయత్రీ మంత్రం, ఇతర సంప్రదాయ ప్రార్థనలను పఠించడాన్ని తప్పనిసరి చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 12న జారీ చేసిన ఈ ఆదేశాల మేరకు పాఠశాలల్లో ఉదయం ప్రార్థన సమయం, భోజనానికి ముందు, అలాగే ఇతర నిర్దిష్ట సందర్భాల్లో సంప్రదాయ ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఈ నిర్ణయాన్ని హిందూ సంఘాలు, సాంస్కృతిక సంస్థలు స్వాగతిస్తున్నాయి.



## ఘనంగా పొణకా కనకమ్మ జయంతి సభ





సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు కీర్తిశేషులు పొణకా కనకమ్మ 135వ జయంతి సభ కార్యక్రమాన్ని నెల్లూరు నగరంలోని టౌన్‌హాల్ ఘనంగా నిర్వహించారు. కనకమ్మ చిత్రపటానికి సామాజిక సమరసతా వేదిక జాతీయ కన్వీనర్ కె. శ్యాం ప్రసాద్, తిరుపతి ఆయుర్వేదిక్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు దీక్షిత్, రాష్ట్ర మహిళా కన్వీనర్ కె. జయప్రద పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జమీందారీ కుటుంబంలో పుట్టిన కనకమ్మ తన 20వ ఏటనే తమ ప్రాంతంలో ప్లేగు వ్యాధి విజృంభించినప్పుడు హరిజనవాడల్లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటుచేయడంతో పాటు రోగులకు శుశ్రూషలు చేసి తొలి హరిజనోద్ధరణ చేపట్టారని చెప్పారు. మహాత్మా గాంధీ పిలుపు మేరకు తన ఆస్తిని భూరి విరాళంగా స్వాతంత్ర్య ఉద్యమానికి అందించారని, ఆంధ్ర ప్రాంతం నుంచి ప్రత్యక్షంగా సత్యాగ్రహాలు నిర్వహించిన తొలి మహిళగా గుర్తింపు పొందారని కొనియాడారు. తన జీవిత చరమాంకంలో తిరువణ్ణామలైలోని శ్రీ రమణ ఆశ్రమంలో గడిపి 71 ఏట (1958లో) తనువు చాలించారని తెలిపారు. జిల్లా సామాజిక సమరసత వేదిక నాయకులు గద్దం లక్ష్మీ, కరణం సుభాషిణి, పోలయ్య, కృష్ణమూర్తి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## తేరా వైభవ్ సదా అమర్ రహే మా...

### ఇ. సమ్మిరెడ్డి (24 ఏళ్ళు)

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని బలార్షా- ఖాజీపేట సెక్షన్ కరీంనగర్ జిల్లాలో జమ్మికుంట ఒక తాలూకా కేంద్రం. అక్కడ నక్సల్ దళాలు బహిరంగంగా సంచరిస్తుండేవి. జమ్మికుంటకు సమీపాన వల్లభ్‌పూర్‌లోని రైతు కుటుంబంలో సమ్మిరెడ్డి జన్మించాడు. హైస్కూల్ చదివేటపుడే ఆరెస్సెస్ స్వయంసేవక్ అయ్యాడు. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక జమ్మికుంటలోని సరస్వతీ శిశు మందిర్‌లో ఆచార్యుడిగా చేరాడు. చురుకుదనం కారణంగా ఆ ప్రదేశంలో ఆరెస్సెస్, ఎబివిపి కార్యకర్తలకు ప్రేరణగా నిలిచాడు. కొన్నాళ్ళకు ఆ ప్రదేశంలో ఎబివిపి బలంగా వేళ్లూనుకుంది.



సైద్ధాంతికంగా తమను వ్యతిరేకించే ఎబివిపి కార్యకర్తలను చంపితే, ఆ సంస్థ కనుమరుగవుతుందని పీపుల్స్ వార్ గ్రూప్ భావించింది. 1986 లో హుజూరాబాద్‌లో సమ్మిరెడ్డి మీద గొడ్డలితో దాడి చేయడంతో ప్రాణాలు పోకపోయినా 6 నెలల పాటు ఆస్పత్రిలో ఉండాల్సి వచ్చింది. 1987లో జరిగిన విద్యార్థి ఎన్నికల్లో ఎబివిపి ఘన విజయం సాధించింది. దీని వెనకున్న శక్తి సమ్మిరెడ్డి అని పీపుల్స్ వార్ గుర్తించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 6న రాత్రి 7గంటల వేళ సమ్మిరెడ్డి బస్టాండ్ దగ్గరలోని ఒక రెస్టారెంట్‌లో ఉండడాన్ని ముగ్గురు నక్సల్స్ గమనించారు. వెంటనే లోపలికి ప్రవేశించి పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో అతనిపై కాల్పులు జరిపారు. వైద్యం కోసం వరంగల్ తరలిస్తుండగా దారిమధ్యలోనే సమ్మిరెడ్డి అసువులు బాశాడు.

## గణేష్ ఉత్సవ సమితి రాష్ట్రస్థాయి సమావేశం

ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్రస్థాయి సమావేశం జూన్ 16న విజయవాడలో జరిగింది. ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉత్సవాల నిర్వహణకు గాను వివిధ విభాగాల అధికారులతో ప్రభుత్వం ముందుగా సమావేశం నిర్వహించాలని సమావేశం కోరింది. మండపాల నమోదు, ఉచిత విద్యుత్తు సేవలను సింగిల్ విండో పద్ధతిలో అందించాలని విన్నవించింది. గణేష్ ఉత్సవాల్లో ధార్మిక చింతన, సామాజిక సద్భావన, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై విశ్రాంత ఐఏఎస్ అధికారి నరసింహం, విశ్రాంత ఐపీఎస్ అధికారి బీవీ రమణ కుమార్, విజయ ఆదిత్య, తనికెళ్ళ సత్య రవికుమార్




మార్గదర్శనం చేశారు. గోకరాజు గంగరాజు మార్గదర్శనంలో చలసాని ఆంజనేయులు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ పాకాల త్రినాథ్, కార్యదర్శి దుర్గాప్రసాద్ రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# హిందుత్వ రక్షణకు అందరూ కృషిచేయాలి

## హరిద్వార్ సమావేశంలో స్వామీజీల పిలుపు

**హ**రిద్వార్‌లోని భూపత్‌వాలాలో ఉన్న నిష్కామ సేవా ట్రస్ట్ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ మార్గదర్శక మండలి రెండు రోజుల సమావేశం జూన్ 19న ముగిసింది. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వందలాది మంది సాధు సన్యాసులు పాల్గొన్నారు. దేశభక్తి, ధర్మజాగరణ కోసం, హిందుత్వ రక్షణ కోసం అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహణలో పారదర్శకత, గోరక్షణ, గోపాలన, వ్యసన విముక్తి, కుటుంబ చట్టాల సమీక్ష, హిందూ సమాజ ఐక్యతపై తీర్మానాలు చేశారు. సమావేశంలో చర్చించిన అంశాలను దండి స్వామి పూజ్య స్వామి జితేంద్రనంద్ సరస్వతి, విహెచ్‌పి అంతర్జాతీయ అధ్యక్షుడు శ్రీ అలోక్ కుమార్ వివరించారు. కుటుంబ, వివాహ వ్యవస్థలకు అనుగుణంగా కుటుంబ చట్టాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. అయోధ్య రామమందిరానికి సమర్పించిన నిధుల విషయంలో తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. 'రామ్ లల్లా'కు చెందిన ప్రతి పైసాకు ట్రస్ట్ బాధ్యత వహించాల్సి ఉంటుంది. 2027 అసెంబ్లీ ఎన్నికల కోసం అయోధ్య అంశాన్ని రాజకీయాల్లోకి లాగడానికి జరిగే దురుద్దేశపూర్వక ప్రయత్నాల పట్ల మనం అప్రమత్తంగా ఉండాలి. ఈ అంశానికి రాజకీయ రంగులు పులుమడాన్ని హిందూ సమాజం ఎప్పటికీ అంగీకరించదు. గోసంరక్షణ, గోపోషణ లక్ష్యం



కోసం ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్‌పి నిరంతరం కృషి చేస్తున్నాయి. దేశంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల దుర్వినియోగం ముప్పును అరికట్టేందుకు, బజరంగ్ దళ్ గత ఏడాది కాలంగా విస్తృతమైన ప్రచారం నిర్వహిస్తోంది. దీన్ని మరింత ప్రభావవంతం చేసేందుకు, సాధువులు కూడా అవగాహన కార్యక్రమాలను చేపట్టనున్నారు. గొప్ప ఆధ్యాత్మిక వ్యక్తి మరియు సామాజిక సామరస్యానికి మార్గదర్శి అయిన సంత్ రవిదాస్ గారి 650వ జయంతిని దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఏడాది పొడవునా జరుపుకోవాలని, అలాగే ఆయన స్ఫూర్తిదాయక సందేశాలను ప్రజల హృదయాల్లో మరియు మనస్సుల్లో నాటాలని సాధువులు పిలుపునిచ్చారు. జనాభా అసమతుల్యత సమస్యను పరిశీలించడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినందుకు ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ, జాతీయ భద్రతను పెంపొందించడంలో, వేర్పాటువాదాన్ని అరికట్టడంలో ఈ చర్య ఒక కీలక ముందడుగు అని సాధువులు ప్రశంసించారు.

# దివ్యాంగులకు 'సక్షమ్' సహకారం



**సక్షమ్** స్థాపన దివస్ సందర్భంగా అనంతపురం దివ్యాంగ సేవా కేంద్రంలో జూన్ 21న నలుగురు దివ్యాంగులకు ట్రాలీలు, 150 మందికి యుడిఐడి కార్డులు, బస్, రైలు పాస్‌లు ఇచ్చారు. కొత్తపట్నంలో జరిగిన కార్యక్రమంలో హియరింగ్ ఎయిడ్స్, వాకర్ స్టాండ్, చక్రాల కుర్చీలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంఘటన కార్యదర్శి కృష్ణ మోహన్, రోడ్సెట్ డైరెక్టర్ కీర్తి, సీఈవో చరణ్ నంద, ఉషా, స్పందన పాల్గొన్నారు.

# గ్రామీణ వికాసం సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



**గ్రా**మీణ వికాస సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన 150 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం కార్యక్రమం జూన్ 13న శ్రీకాకుళం జిల్లా ఘనసరలో జరిగింది. భామిని మండలం తహసీల్దార్ ఎం.నాగేంద్రప్రసాద్, గ్రామీణ వికాస్ సంఘం అధ్యక్షులు గుండ్ల సత్యరావు, వ్యాపారవేత్త బరాటం గోవిందరావు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సంస్థ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల పట్ల నాగేంద్రప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

# రిజిస్ట్రేషన్ లేకుంటే చట్టబద్ధత లేదా?

ఇటీవలి కాలంలో సామాజిక మాధ్యమాల్లో, రాజకీయ వేదికలపై ఒకే ప్రశ్నను పదేపదే లేవనెత్తుతున్నారు. "రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు రిజిస్ట్రేషన్ లేదు. మరి అలాంటి సంస్థ ఎలా పనిచేస్తోంది?" అని ప్రశ్నిస్తూ, సంఘం చట్టబద్ధతనే సందేహాస్పదంగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోంది. **ఒక అబద్ధాన్ని పదేపదే చెబితే అది నిజమవుతుందనే ప్రచార పద్ధతిలో ఈ అంశాన్ని సమాజంలోకి వదులుతున్నారు. కానీ ఈ మొత్తం వివాదంలో ఒక ప్రాథమికమైన ప్రశ్నను మాత్రం విస్మరిస్తున్నారు. రిజిస్ట్రేషన్ లేకపోతే ఒక సంస్థ చట్టబద్ధమైనది కాదా? భారతదేశ చట్టాలు నిజంగా అదే చెబుతున్నాయా?** ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే భావోద్వేగాల కంటే చట్టాన్ని, ప్రచారం కంటే కోర్టుల తీర్పులను, ఊహాగానాల కంటే చారిత్రక వాస్తవాలను పరిశీలించాల్సి ఉంటుంది.


### శతాబ్ద కాలపు చరిత్ర.. ప్రభుత్వాల వైఖరి

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ దాదాపు శతాబ్దకాలం నుంచి దేశవ్యాప్తంగా పనిచేస్తోంది. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిష్‌ర్ల పాలనలో ప్రారంభమైన ఈ సంస్థ.. స్వాతంత్ర్యం తర్వాత కూడా తన కార్యకలాపాలను కొనసాగించింది. ఈ సుదీర్ఘ కాలంలో సంఘంపై మూడుసార్లు నిషేధం విధించారు. ఆదాయపు పన్ను శాఖ విచారణలు జరిపింది. ఆయా నిషేధాలపై చట్టపరమైన న్యాయపోరాటాలు జరిగాయి. పార్లమెంటులో అనేకసార్లు సుదీర్ఘ చర్చలు జరిగాయి. అయినప్పటికీ, ఏ ప్రభుత్వం గానీ, ఏ ఉన్నత న్యాయస్థానం గానీ "ముందు ఆరెస్సెస్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి, అప్పుడే అది చట్టబద్ధమైన సంస్థ అవుతుంది" అని ఒక్కసారి కూడా చెప్పలేదు. ఈ ఒక్క చారిత్రక వాస్తవమే ప్రస్తుతం జరుగుతున్న దుష్ప్రచారానికి గట్టి సమాధానం చెబుతుంది. ఇటీవల ఈ అంశంపై **సర్ సంఘ చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ స్పందిస్తూ ఒక తార్కికమైన విషయాన్ని గుర్తుచేశారు. "1925లో బ్రిటిష్ పాలనలో ప్రారంభమైన సంస్థ బ్రిటిష్ ప్రభుత్వానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆశించడం హాస్యాస్పదం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా భారతదేశ చట్టాలు ప్రతి సామాజిక సంస్థకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయలేదు" అని స్పష్టం చేశారు.** అంతేకాదు, చట్టప్రకారం బాడీ ఆఫ్ ఇండివిడ్యువల్స్ (వ్యక్తుల సమూహం) అనే హోదా పూర్తిగా చట్టబద్ధమైనదని, ఆరెస్సెస్ అదే పరిధిలోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. "హిందూ ధర్మానికి ఎక్కడైనా రిజిస్ట్రేషన్ ఉందా? లేనంత మాత్రాన దానికి ఉనికి లేదా?" అన్న ఆయన ప్రశ్న కేవలం భావోద్వేగంతో అన్నది కాదు, భారత చట్టవ్యవస్థలో ఉన్న వాస్తవాన్ని ప్రతిబింబించింది.

### రాజ్యాంగ ప్రాతిపదిక.. చట్టపరమైన హోదా

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(సి) ప్రతి పౌరుడికి సంఘాలు, సమాజాలు ఏర్పాటు చేసుకునే ప్రాథమిక హక్కును కల్పించింది. అయితే సమాజ హితం కోసం పనిచేసే ప్రతి సంస్థ కూడా తప్పనిసరిగా సొసైటీగా, ట్రస్ట్‌గా లేదా ఎన్జీవోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రాజ్యాంగం గానీ, దేశంలోని సాధారణ

### ఆర్ఎస్ఎస్‌పై ప్రచారం.. చట్టపరమైన వాస్తవాలు




చట్టాలు గానీ ఎక్కడా నిబంధన విధించలేదు. **చట్టపరంగా సంస్థలు వివిధ రూపాల్లో పనిచేయవచ్చు. భారతీయ పన్ను చట్టాల ప్రకారం సంఘాల మనుగడను రెండు విభాగాలుగా చూడవచ్చు: ఒకటి అసోసియేషన్ ఆఫ్ పర్సన్స్ (ఎఒపి), రెండోది బాడీ ఆఫ్ ఇండివిడ్యువల్స్ (బిఒఐ). ఈ రెండింటికీ చట్టంలో స్పష్టమైన గుర్తింపు ఉంది. బిఒఐగా చట్టబద్ధంగా ఉనికిలో ఉండటానికి ఎన్జీఓ వంటి ప్రత్యేక రిజిస్ట్రేషన్ ప్రక్రియలతో నిమిత్తం లేదు. ఆరెస్సెస్ విషయంలోనూ ఇదే చట్టపరమైన స్థితి వర్తిస్తుంది.**

### చారిత్రాత్మక తీర్పు.. 'గురుదక్షిణ' వివాదం

ఆరెస్సెస్ చట్టపరమైన ఉనికిని, దాని ఆర్థిక నమూనాను అత్యంత స్పష్టంగా నిర్ధారించిన చారిత్రక ఘట్టం 'గురుదక్షిణ'పై జరిగిన ఆదాయపు పన్ను వివాదం. 1967-68 నుంచి 1975-76 వరకు స్వయంసేవకులు సమర్పించిన గురుదక్షిణపై ఆదాయపు పన్ను విధించాలని పన్నుల శాఖ ప్రయత్నించింది. విరాళాలు ఇచ్చిన వారి పేర్లు, చిరునామాలు రికార్డుల్లో నమోదు చేయలేదని పేర్కొంటూ ఆ నిధులను పన్ను పరిధిలోకి తీసుకురావాలని వాదించింది. అదే సమయంలో ఆరెస్సెస్ దీనిని గట్టిగా సవాలు చేసింది. గురుదక్షిణ అనేది బాహ్య సమాజం నుండి వ్యాపార పరంగా ఆర్జించిన ఆదాయం కాదని, అది సభ్యులు (స్వయంసేవకులు) స్వచ్ఛందంగా తమ సంస్థ కోసం సమర్పించుకున్న నిధి మాత్రమేనని పేర్కొంది. అందువల్ల దీనిపై ప్రిన్సిపల్ ఆఫ్ మ్యూట్యువాలిటీ (పరస్పర సూత్రం ) వర్తిస్తుందని సంఘం వాదించింది. ఈ వివాదం చివరకు కమిషనర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్ వర్సెస్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (1994)

(మిగతా 11వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)
కేసుగా పాట్నా హైకోర్టుకు చేరింది. అంతకుముందే కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు కూడా 1978 డిసెంబర్ 19న జారీ చేసిన సర్క్యులర్‌లో ఆరెస్సెస్‌కు సంబంధించిన గురుదక్షిణపై పరస్పర సూత్రం వర్తిస్తుందని అంగీకరించింది. పాట్నా హైకోర్టు కూడా అదే చట్ట సిద్ధాంతాన్ని సమర్థిస్తూ ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుకూలంగా తీర్పు చెప్పింది. సభ్యులు సమర్పించే గురుదక్షిణకు పరస్పర సూత్రం వర్తిస్తుందని, అందువల్ల అది ఆదాయపు పన్ను పరిధిలోకి రాదని స్పష్టం చేసింది. ఈ తీర్పు ప్రాముఖ్యత కేవలం పన్ను మినహాయింపునకు మాత్రమే పరిమితం కాలేదు. కోర్టు ముందు నిలిచిన సంస్థ చట్టపరమైన ఉనికిని న్యాయవ్యవస్థ అంగీకరించిన తర్వాతే.. ఆ సంస్థ ఆదాయం, నిధుల స్వభావం, పరస్పర సూత్రం వంటి అంశాలను పరిశీలించడం సాధ్యమైంది. ఒకవేళ ఆరెస్సెస్ చట్టబద్ధమైన సంస్థ కాకపోయి ఉంటే, ఆ విచారణే చెల్లేది కాదు. కానీ సిబిటిడి, ఆదాయపు పన్ను ట్రిబ్యునళ్లు, పాట్నా హైకోర్టు అన్నీ ఆరెస్సెస్ ను ఒక చట్టబద్ధమైన వ్యవస్థగా పరిగణించి తీర్పులు ఇచ్చాయి.

### నిషేధాల వెనుక ఉన్న నిజం

సంఘంపై విధించిన మూడు నిషేధాలను (1948, 1975, 1992) మనం గుర్తు చేసుకోవాలి. ప్రభుత్వం ఒక చట్టబద్ధమైన ఉనికి లేని శూన్య సంస్థపై అధికారిక గెజెట్ నోటిఫికేషన్ ద్వారా నిషేధం విధించడం సాధ్యమేనా? ఆ నిషేధాలు న్యాయస్థానాల ముందుకు వెళ్లినప్పుడు కూడా కోర్టులు సంఘం ఉనికిని ఎన్నడూ తప్పుబట్టలేదు. **1949లో ప్రభుత్వం సూచించిన ఒకే ఒక్క అంశం -- సంఘం తనకంటూ ఒక లిఖిత పూర్వక రాజ్యాంగాన్ని రూపొందించుకోవాలనేది. సంఘం ఆ సూచనను గౌరవించి రాజ్యాంగాన్ని సమర్పించింది. అంతే తప్ప "ముందు రిజిస్ట్రేషన్ చేయించుకోండి" అనే మాట ఎక్కడా రాలేదు.** ఇక్కడ మరో కీలకమైన తేడాని గమనించాలి. సంఘం ప్రేరణతో నడిచే విద్యా సంస్థలు, ఆసుపత్రులు, సేవా విభాగాలు, గ్రామాభివృద్ధి సంస్థలు వంటివన్నీ ఆయా చట్టాల ప్రకారం ట్రస్టులుగా, సొసైటీలుగా రిజిస్టర్ అయి పారదర్శకంగా పనిచేస్తున్నాయి. అయితే సంఘం యొక్క మూల కార్యకలాపమైన దైనందిన 'శాఖ' వ్యవస్థ మాత్రం స్వయంసేవకుల స్వచ్ఛంద గురుదక్షిణ ఆధారంగానే రాజ్యాంగము మరియు చట్టాలకు లోబడి కొనసాగుతోంది.

### పరిపాలనా ప్రక్రియ వేరు... చట్టబద్ధత వేరు!

వాస్తవానికి ఈ మొత్తం వివాదం 'రిజిస్ట్రేషన్' అనే పదానికి, 'చట్టబద్ధత' అనే పదానికి మధ్య ఉన్న ప్రాథమిక తేడాను అర్థం చేసుకోకపోవడం వల్లే వస్తోంది. **రిజిస్ట్రేషన్ అనేది కొన్ని చట్టాల కింద ఏర్పడే సంస్థలకు అవసరమయ్యే ఒక పరిపాలనా ప్రక్రియ మాత్రమే. కానీ చట్టబద్ధత అనేది రాజ్యాంగం దేశ చట్టాలు, న్యాయస్థానాల గుర్తింపు ద్వారా నిర్ణయించబడుతుంది. ఈ రెండింటినీ ఒకటిగా చూడటం చట్ట ప్రకారం ముమ్మాటికీ తప్పే అవుతుంది.** అందుకే నేడు "ఆరెస్సెస్‌కు రిజిస్ట్రేషన్ లేదు కాబట్టి అది చట్టబద్ధమైన సంస్థ కాదు" అని ప్రచారం చేసేవారు, గత వందేళ్ల చట్టపరమైన చరిత్రను, ప్రభుత్వాల అధికారిక వైఖరిని, ఉన్నత న్యాయస్థానాల తీర్పులను విస్మరిస్తున్నారు. **వాస్తవాలు చెబుతున్నది ఒక్కటే... ఎన్జీవోగా రిజిస్ట్రేషన్ లేనంత మాత్రాన ఒక సంస్థ చట్టవిరుద్ధం అవదు. భారత చట్టవ్యవస్థ గుర్తించిన బాడీ ఆఫ్ ఇండివిడ్యువల్స్ రూపంలో ఒక సంస్థ పూర్తిగా చట్టబద్ధంగా ఉనికిలో ఉండవచ్చు, పనిచేయవచ్చు. ఆరెస్సెస్ విషయంలో ఇదే పరమసత్యాన్ని ప్రభుత్వాల చర్యలు, న్యాయస్థానాల తీర్పులు పదేపదే ధృవీకరించాయి.** రాజకీయ ప్రచారం కంటే చట్టం గొప్పది. తాత్కాలిక అపోహల కంటే చారిత్రక వాస్తవాలు బలమైనవి.

**– ధావా**

## శారీరక దృఢత్వం పెంచే వంగుళ్లు.. దూకుళ్ళు

**తె**లుగు రాష్ట్రాల్లో పిల్లలు ఆడుకునే ఒక ప్రసిద్ధ సాంప్రదాయ గ్రామీణ క్రీడ వంగుళ్ళు – దూకుళ్ళు. ఈ ఆటను ఒకేసారి ఐదుగురు నుంచి 10మంది వరకు ఆడవచ్చు. ఈ ఆట పిల్లల్లో చురుకుదనాన్ని, ఏకాగ్రతను, శారీరక దృఢత్వాన్ని పెంచుతుంది. ఖరీదైన పరికరాలు లేకుండా, కేవలం మైదానంలో ఆడుకునే అద్భుతమైన వినోదాత్మకమైన వ్యాయామం.

**ఆడే విధానం:** ముందుగా పంటలు వేసి మిగిలిపోయిన బాలుడు దొంగవుతాడు. దొంగ (లేదా గురి) తల దించుకుని, నడుము వంచి నిలబడాలి. మిగిలిన ఆటగాళ్ళు ఒక్కొక్కరుగా పరిగెత్తుకుంటూ వచ్చి, వంగి ఉన్న వ్యక్తి వీపుపై రెండు చేతులు ఆనించి, కాళ్ళు రెండు పక్కలకు చాపి దూకాలి.



**ఎత్తులు పెంచడం:** అందరూ దూకిన తర్వాత, వంగి ఉన్న ఆటగాడు కొంచెం పైకి లేచి నిలబడతాడు. ఇలా మోకాళ్ళు, నడుము, భుజాల మీదుగా దూకే ఎత్తును పెంచుతూ పోతారు.

**ఓటమి:** దూకేటప్పుడు ఎవరైనా ఆ వ్యక్తిని తాకినా లేదా దూకలేక కింద పడినా, వారు 'దొంగ' అవుతారు. అప్పుడు వారు వంగి నిలబడాల్సి వస్తుంది.


# తపోసంపన్నుడు భరద్వాజ మహర్షి

**దే**వతల గురువు బృహస్పతి కుమారుడైన భరద్వాజ మహర్షి సప్త ఋషులలో ఒకరు. భరద్వాజుడు త్రికాలవేత్త, గొప్ప తపోసంపన్నుడు. భృగు మహర్షిని అడిగి పంచభూతాలు ఎలా ఏర్పడ్డాయి.. ఈ సృష్టి ఎలా జరిగింది వంటి అనేక విషయాలు తెలుసుకున్నాడు. చరక సంహిత ప్రకారం, ఈయన దేవతల రాజు అయిన ఇంద్రుని వద్ద వైద్య శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. రామాయణంలో భరతుడు తన అన్న అయిన శ్రీరాముడిని అయోధ్యకు తిరిగి తీసుకురావడానికి మంత్రులు, పురజనులు, చతురంగ బలాలతో కలసి అడవికి బయలు దేరతాడు. భరద్వాజ మహర్షి ఇతని భ్రాతృ భక్తిని పరీక్షించి, ప్రశంసిస్తాడు. రాముడు తన వనవాసం సందర్భంగా భరద్వాజ దంపతులను దర్శించి వారి ఆశీర్వచనాలు తీసుకుంటాడు. చిత్రకూటంలో ఆశ్రమం నిర్మించుకొని అక్కడ నివాసం ఉండమని రాముడికి మహర్షి నిర్దేశిస్తాడు. అరణ్యవాసం పూర్తయిన తర్వాత రాముడు ఆయన ఆశ్రమాన్ని దర్శిస్తాడు. మహాభారతంలో కురు పాండవుల గురువైన ద్రోణాచార్యుడు భరద్వాజుని కుమారుడే. ద్రోణుడికి అశ్వత్థామ పుట్టాడు. ఇలా భరద్వాజ వంశం వృద్ధి అయింది. భరద్వాజుడు ఒకసారి గొప్పగొప్ప మునులందరూ భరద్వాజుడి దగ్గరకు వచ్చి ఉదయం ముఖం కడుక్కోవటం దగ్గర్నుంచి రాత్రి పడుకునే వరకు అన్ని పనులు శాస్త్రోక్తంగా ఎలా చెయ్యాలో తెలుసుకున్నారు. ఏ కొత్త పని మొదలు పెట్టినా తూర్పువైపు తిరిగే మొదలుపెట్టాలని అన్ని విషయాలు వారికి వివరంగా చెప్పాడు భరద్వాజుడు. ఈ



గ్రంథాన్నే భరద్వాజ స్మృతి అంటారు. అలాగే విమానాలు ఎలా తయారు చెయ్యాలి అనే అంశంపై 8 అధ్యాయాలతో భరద్వాజుడు వైమానిక శాస్త్రం రాశాడు. ఈ విమానం విరగనిది, కోసినా తెగకుండా, కాలిపోకుండా ఉండేది. అందులో శత్రువుల మాటలు వినగలిగేలా, పొటోలు తీసుకోగలిగేలా, శత్రు విమానాల జాడ తెలుసుకోగలిగేలా, పైలట్లను మూర్ఛపోయేలా చెయ్యగలిగే చాలా పరికరాలుంటాయి. అంటే ఇవి యుద్ధవిమానాలేమో. విమానానికి 31 భాగాలు ఉండాలని, దాన్ని నడిపే వాళ్ళకి వేరువేరు దుస్తులు ఉండాలనీ, కాలాన్ని బట్టి తినడానికి 3 రకాల ఆహార పదార్థాలు ఉండాలనీ, వాటివల్ల గాలిలో ఉండే 25 రకాల విషాలు ఏం చెయ్యకుండా ఉంటాయనీ రాశాడు. 16 రకాల లోహాలతో విమానాన్ని తయారు చేస్తే ఏ వాతావరణానికయినా తట్టుకుని చెక్కు చెదరకుండా ఉంటుందిట.

# హార్మోన్లను అదుపుచేసే అనంతాసనం



**అ**నంతాసనం (నిద్రిస్తున్న విష్ణు భంగిమ అని కూడా అంటారు) అనేది శరీరాన్ని పక్కకు వంచి, కాళ్లను పైకి లేపి బ్యాలెన్స్ చేసే ఒక అద్భుతమైన యోగాసనం. ఇది శరీర వశ్యతను పెంచడానికి, తొడలు, పిరుదులు సాగదీయడానికి, నాడీ వ్యవస్థను ప్రశాంతపరచడానికి చాలా బాగా పనిచేస్తుంది. ఈ ఆసనం వేసేవారు పాలకూర, చిలగడ దుంపలు, అవిసెలు, బీన్స్ ఎక్కువగా తినాలి. నీరు సమృద్ధిగా తాగాలి.

**చేసే విధానం:** ముందుగా యోగా మ్యాట్‌పైన శవాసనంలో విశ్రాంతంగా పడుకోవాలి. ఆ స్థితిలోనే మెల్లగా ఎడమవైపు తిరగండి. కాళ్లను ఒకదానిపై మరొకటి వచ్చేలా ఉంచాలి. ఇప్పుడు ఎడమ చేతిని వంచి, తలను అరచేతిలో ఆన్చాలి. ఇప్పుడు గాలి తీసుకుంటూ కుడి కాలిని వంచి కుడి చేత్తో కాలి బొటనవేలిని గట్టిగా పట్టుకోవాలి. గాలి వదులుతూ కాలిని నెమ్మదిగా పైకి ఎత్తండి. మోకాలిని వంచకుండా చూసుకోవాలి. ఈ ఆసన స్థితిలో పడిపోకుండా శరీరాన్ని సమస్థితిలో ఉంచాలి. ఆసనంలో 10–15 సెకన్లు ఉండాలి. ఆ తర్వాత నెమ్మదిగా చేతిని, కాలిని కిందకు దించి శవాసనంలోకి రండి. విశ్రాంతంగా రెండు నిమిషాలు పడుకున్నాక ఇదేవిధంగా రెండోవైపూ ఆసనాన్ని చేయాలి.

**ఇవీ ప్రయోజనాలు:** శరీరానికి విశ్రాంతిని ఇచ్చే ఈ భంగిమ, అంతర్గత నిశ్చలత్వాన్ని పొందడానికి ఉపయోగపడుతుంది. హార్మోన్ల సమతుల్యానికి తోడ్పడుతుంది. నడుము కింద భాగాల్లో కొవ్వును కరిగిస్తుంది.

**ఎవరు చేయకూడదు:** వెన్నెముక సమస్యలు, స్లిప్డ్ డిస్క్ ఉన్నవారు, మణికట్టు గాయాలున్నవారు ఈ ఆసనం చేయకూడదు.

# ఏకపత్నీ వ్రతంతో జాతికి ఆదర్శం!

అయోధ్య నుంచి అరణ్యానికి వచ్చిన మొదటి రాత్రి లక్ష్మణుడితో రాముడు అనేక విషయాలు మాట్లాడతాడు. తల్లి స్థితిని తలుచుకొని బాధపడతాడు. కౌసల్య, సుమిత్రలను రక్షించడానికి లక్ష్మణుడిని తిరిగి అయోధ్యకు వెళ్లిపొమ్మంటాడు. తండ్రి గురించి, కైక గురించి కొంత నిష్ఠూరంగా మాట్లాడతాడు. ఒక్కసారిగా జీవన విధానం మారిపోయిన తర్వాత తనవారిని, మాతృభూమిని విడిచి చాలాదూరం వచ్చి ఇంకా చాలాకాలం ఇలాగే గడపాలని నిశ్చయమైపోయిన తర్వాత ఈ విధమైన బాధ కలగడం సహజమే. ఈ సందర్భంలోనే రాముడు ఇలా అంటాడు.



"లక్ష్మణా.. కోపం వస్తే నేను ఒక్కడినే బాణాలతో అయోధ్యతో పాటు ఈ భూమి అంతటినీ కూడా సాధించగలను. కానీ ఇది పరాక్రమం చూపించే సందర్భం కాదు కదా'' అంటాడు. రాముడిలోని అతి ముఖ్యమైన ఆదర్శ గుణం ఏకపత్నీ వ్రతం. బహుభార్యత్వం అమలులో ఉన్న ఆ రోజుల్లోనే రాముడు ఏకపత్నీ వ్రతుడై జాతికి ఆదర్శంగా నిలిచాడు. దశరథుడికి కూడా 300 మంది భార్యలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆ పరిస్థితుల్లో ఏకపత్నీత్వం అనేది వ్రతంగా పెట్టుకున్న రాముడు పండిత, పామర విక్ష లేకుండా జనులందరికీ ఆరాధ్యుడయ్యాడు. రాముడు తనను తప్ప వేరొకరిని కన్నెత్తి చూడడని సీతకు తెలుసు. నిష్కారణంగా రాక్షసులతో శత్రుత్వం వద్దని చెప్పే సందర్భంగా సీత ఈ మాటను తానే అంటుంది. ధర్మాత్ముడు, సత్యసంధుడు అయిన రాముడు ఇంద్రియ నిగ్రహం కలవాడని, తన భార్యపై మాత్రమే ఆసక్తి గలవాడని తనకు తెలుసని అంటుంది. అనేక సందర్భాల్లో రాముడు సీత పట్ల తనకున్న ప్రేమను వ్యక్తం చేస్తాడు. సీతారాములు ఒకరి మనోభావాలను మరొకరు తెలుసుకొని మెలిగేవారు. సీత లేకపోతే స్వర్గం కూడా తనకు ఇష్టం లేదని రాముడు అంటాడు. సీత పక్కన ఉండగా చిత్రకూటం మీద నివసించడం తనకు అయోధ్యా వాసం కంటే ఎక్కువ ఆనందాన్ని ఇస్తుందని చెబుతాడు. సీతాపహరణానికి కుమిలి కుమిలి ఏడుస్తాడు. ఆమె వియోగంతో శుష్కిస్తాడు. సీతారాముల పరస్పర అనురాగం గురించి చెబుతూ "ఉత్తమమైన మనసు కలిగిన రాముడు సీత యందే తన మనుసును నిలిపాడు. ఆమె కూడా తన హృదయంలో రాముడిని సర్వదా నిలుపుకొంది. ఈ విధంగా అన్యోన్యాసక్తులై సీతారాములు అనేక రుతువుల పాటు విహరించారు" అని వాల్మీకి ఎంతో రమ్యంగా వివరించారు.

# శీలం పరమ భూషణం!

**ఉజ్వల:** వదినా! ఏం చేస్తున్నావు... మొబైల్ పట్టుకొని ఏమిటి ఆలోచిస్తున్నావు దీర్ఘంగా.

**రమ్య:** ఏంటో వదినా! ఈ మొబైల్ చేతిలో ఉంటే సమయం ఎలా గడిచిపోతుందో తెలియడం లేదు. గంటలు కూడా క్షణాల్లా దొర్లిపోతుంటాయి. దీని గురించి తరువాత మాట్లాడుకుందాం కానీ నీతో ఒక విషయం చెప్పాలి.

**ఉజ్వల:** సరే చెప్పు. ఇంతకీ ఏమిటి సంగతి?

**రమ్య:** ఈ మధ్య వార్తలు వింటున్నావా. చూస్తున్నావా... పెద్ద పెద్ద నగరాలలు, మెట్రోపాలిటన్ సిటీల్లో ముఖ్యంగా అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి ఒకే గదిలో సహజీవనం చేస్తున్నారట



**ఉజ్వల:** అవును. నేనూ విన్నాను. అయినా ఇదేమీ కొత్త విషయం కాదూ కదా?

**రమ్య:** కొత్త విషయం కాకపోయినా మితిమీరిన స్వేచ్ఛ హద్దులు దాటుతోంది కదా. ఇంట్లో తల్లిదండ్రులు పిల్లలపై నమ్మకంతో చదువులు, ఉద్యోగాల పేరుతో పంపిస్తే వీళ్ళు చేసే పనులు ఇలా ఉంటున్నాయి. చదువుకునేవారు అయితే వాళ్ళ సౌకర్యాలు, ఆనందాల కోసం, ఉద్యోగం చేసేవారు అయితే చేతిలో డబ్బులు ఉన్నాయి కాబట్టి జల్సా చేయాలి అనే భావనతో ఇలాంటి పనులు చేస్తున్నారు.

**ఉజ్వల:** చుట్టూ పరిస్థితులు ఇలాగే ఉన్నాయి. ప్రస్తుతం వస్తున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు కూడా అవే చూపెడుతున్నాయి. హాస్టళ్లలో నిత్యం ఇలాంటివారు చుట్టూ కనబడుతూ ఉంటే... మేమూ చేయడంలో తప్పేంటి అనుకుంటున్నారు.

**రమ్య:** చదువు, సంపాదన, సమాజంలో స్థాయి మీదనే తల్లిదండ్రులు దృష్టి పెడుతున్నారు కానీ విలువలు నేర్పిస్తున్నారా?

**ఉజ్వల:** శీలం అంటే అదేదో శారీరక పరమైన అంశంగానే అనుకుంటున్నారు తప్ప.. శీలం అంటే వ్యక్తిత్వం, మన ప్రవర్తన అని చెప్పే పెద్దలు ఎక్కడున్నారు. మంచి నడవడిక, నిజాయితీ, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం కలిగి ఉండటమూ శీలం కిందకే వస్తాయి. "శీలం పరమ భూషణం".. అంటే మనిషికి ఆభరణాలు, అందం కంటే కూడా మంచి ప్రవర్తనే అత్యంత శ్రేష్ఠమైన ఆభరణం అని అర్థం.

**రమ్య:** అవును. విలువలతో కూడిన విద్యను నేర్పించే శిశు మందిరాలలో పిల్లలను చేర్పించడంతో పాటు ఇళ్లల్లో విలువలతో కూడిన సంస్కారాలను అందించడమే దీనికి పరిష్కారం.

## పదకేళి 21

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | 4 | |
| | | | | 5 | | | |
| 6 | 7 | | 8 | | 9 | | 10 |
| | 11 | | | | 12 | | |
| 13 | | | 14 | | | | |
| 15 | | | | | | | 16 |
| | | 17 | | 18 | | 19 | |
| | 20 | | | 21 | | | |

**ఆధారాలు**

**అడ్డం**

1. యోగసూత్రాల రూపకర్త (4)
3. కామాఖ్య దేవాలయం ఉన్న నగరం (3)
6. సత్యము (2)
8. పార్వతీదేవి (3)
11. చాటింపు (3)
12. అహంకారము (3)
14. ముక్కుపుడక (3)
15. స్వప్నము (2)
19. పట్టాలపై పరుగులు తీసేది (2)
20. అరికాలిలో నరకం చూపే కాయ (2)
21. ప్లాస్టిక్ సర్జరీ కనిపెట్టిన భారతీయ శాస్త్రవేత్త (4)

**నిలువు**

1. సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రం (3)
2. భారీ వాన (2)
4. నాగలి (2)
5. దయ (2)
7. ఇద్దరు కలిసుంటే... (2)
8. ఒక పిట్ట (4)
9. తెల్లటి లోహం (4)
10. సర్పము (2)
13. కట్టె --- పొయ్యి తీరుస్తుంది (3)
16. బలమున్న వాడు (3)
17. కాలువ తూము, చిన్న పడవ (2)
18. నూలును పడుగు చేసే సాధనం (2)
19. వ్యవసాయదారుడు (2)


## పదకేళి 20 - జవాబులు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 య | ము | 2 న | | 3 భో | 4 జ | శా | 5 ల |
| క్షు | | 6 ది | 7 నం | | న | | త్తు |
| 8 డు | 9 రే | | వ | | 10 గ | రి | క |
| | 11 గ | స | | 12 పీ | ఠ | | |
| 13 కా | డి | | 14 సి | | 15 న | ట | 16 న |
| న | | 17 ఛీ | లి | క | | | గ |
| | 18 పె | రు | గు | | 19 సు | 20 వేం | దు |
| 21 వె | న్న | | 22 రి | క్క | | క | |

# మారుతున్న కాలానికి హిందుత్వం

**1947లో** రాజకీయ స్వాతంత్ర్యం వచ్చినా, ఆ తరువాత కూడా భారతదేశం వలస పాలన, మార్క్సిజం ప్రభావాలలో ఉండిపోయింది. 1947లో పూర్తిగా లభించని సాంస్కృతిక స్వాతంత్ర్యాన్ని సాధించుకునేందుకు భారత్ ఇప్పుడు శ్రమిస్తోంది. ఒక నాగరికతగా భారత్ మళ్లీ ఉన్నతి చెందుతున్నది. ప్రపంచ రంగస్థలంపై కొత్తగా భారత్ అవతరణకు ఇప్పుడు ఆధిపత్యం చేస్తున్న కొన్ని సంస్కృతుల నుంచి అభ్యంతరం ఎదురు కావచ్చు. దానినుంచి వాటి పెత్తనానికి సవాలు వస్తుందనేది ఇందుకు కనీస కారణం. ఈ భారతీయ చింతన యొక్క వాణి జాతీయస్థాయిలో వినిపిస్తున్న హిందుత్వం ఈ ప్రాంతపు ప్రాచీన నాగరికత అయిన భారతీయ సంప్రదాయాన్ని లేక భారత్‌గా ఇండియాని ప్రతిధ్వనిస్తోంది. ఈ హిందూ జాగృతికి

## పుస్తక పరిచయం



**రచన:** జె. నందకుమార్


**తెలుగు అనువాదం:** వి.వి. సుబ్రహ్మణ్యం

**ప్రచురణ:** సాహిత్య నికేతన్, విజయవాడ **పేజీలు:** 192

**వెల:** రూ. 150/-

**ప్రతులకు:** సాహిత్య నికేతన్, ఏలూరు రోడ్డు, రామమందిరం వీధి, విజయవాడ-520002.

**సెల్ నం.:** 8333812687.




సంబంధించిన ప్రధాన అంశాలను, దానికి ఎదురవుతున్న సవాళ్లను "మారుతున్న కాలానికి హిందూత్వం" అనే ఈ పుస్తకం చక్కగా వివరిస్తున్నది. మానవత గురించి భారత్ దృష్టిపైన, ఈనాటి ప్రపంచ వ్యాప్త సమస్యలపైన ముస్ముందు జరిగే చర్చలకు, వాద ప్రతివాదాలకు, వివరణలకు ఈ పుస్తకం చక్కని వేదిక కాగలదు.

## ఈ నెల పద్యము



**॥ తెలియని మనుజుని సుఖముగ**
**తెలుపందగు సుఖతరముగ తెలుపగవచ్చున్**
**దెలిసిన వానిం దెలిసియు**
**తెలియని నరుదేల్ప బ్రహ్మదేవుని వశమే ॥**

**భావము:** ఏమీ తెలియని వారికి (అజ్ఞానులకు) ఏదైనా విషయాన్ని సులభంగా చెప్పి అర్థమయ్యేలా చేయవచ్చు. బాగా తెలిసినవారికి ఇంకా సులభంగా విషయాలను విశదీకరించి చెప్పవచ్చు. కానీ కొంత తెలిసి, కొంత తెలియక ఉండేవాడికి ఏ విషయమైనా ఆ బ్రహ్మ దేవుడు కూడా బోధించపలేదు.

# ఓయూలో గిరిజన సంస్కృతి, జీవన విధానాలపై జాతీయ సదస్సు



'గిరిజన సంస్కృతి మరియు జీవనం: గతం, వర్తమానం మరియు భవిష్యత్తు' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల ప్రత్యేక ప్రస్తావనతో జరిగిన ఈ సదస్సులో గిరిజన సమాజాల అభివృద్ధి, సంస్కృతి పరిరక్షణ, భవిష్యత్ అవకాశాలపై విస్తృత చర్చలు జరిగాయి. ముఖ్య అతిథి మధ్యప్రదేశ్ గవర్నర్ సలహాదారు దీపక్ ఖండేకర్ మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, అభివృద్ధి సంబంధిత సవాళ్లు దాదాపు ఒకే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమానికి విధానపరమైన చర్చలు, సమిష్టి కార్యాచరణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ గిరిజన సమాజాల అభ్యున్నతికి విశ్వవిద్యాలయం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం సామాజిక సమరసత జాతీయ కన్వీనర్ కె. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ 35 గిరిజన తెగల సామాజిక, సాంస్కృతిక జీవన విధానాలపై తన అధ్యయనాలను వివరించారు. గిరిజన సమాజాల మధ్య ఐక్యత, పరస్పర సహకారం, సామాజిక సమగ్రతను కాపాడాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. గిరిజన సంస్కృతి, సాహిత్యం, సామాజిక వాస్తవాలపై ప్రఖ్యాత పండితుడు ప్రొఫెసర్ పొలిగొండ సుబ్బాచారి విలువైన అభిప్రాయాలను పంచుకున్నారు. గిరిజన సమాజాల అభివృద్ధికి ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మరింత సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గత కొన్ని వేల సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన గిరిజనుల సమగ్ర అభివృద్ధి మనందరి బాధ్యత అనే అభిప్రాయ నిర్మాణం దిశగా ఈ రెండు రోజుల సభను నిర్వహిస్తున్నామని డాక్టర్ రాజేశ్వరరావు అన్నారు. మాజీ గవర్నర్లు చెన్నమనేని విద్యాసాగర రావు, బండారు దత్తాత్రేయ, ఆచార్య శర్మ(జాతీయ డైరెక్టర్, ఆర్కిటిక్ సర్వే ఆఫ్ ఇండియా, కోల్‌కతా), రెండు తెలుగు రాష్ట్రాల బిజెపి అధ్యక్షులు రామచంద్ర రావు, మాధవ్, వివిధ గిరిజన తెగల ప్రముఖులు వేదికపై ఆసీనులయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా 35 గిరిజన తెగలకు ప్రతినిధులుగా 8మంది తెగల ప్రముఖులను ఘనంగా సన్మానించారు. డాక్టర్ హెచ్.కె. నాగు (జాతీయ ఉపాధ్యక్షులు, వనవాసీ కల్యాణ ఆశ్రమం), పొట్లూరి శ్రీనివాసులు, భూమిని వెంకటేశం, పులి రాము, యాబ సీతయ్య, కె,విజయశంకర్, డాక్టర్ మేశ్రామ్ మనోహర్, చరణ్ సింహ్ పాల్గొన్నారు.

## ఫొటో వార్తలు




అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల జిల్లా అయ్యలూరులోని ఎస్వీఆర్ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలో ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ఆరోగ్య, యోగ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, ప్రధాన వక్త అఖిల భారతీయ సహ సంఘటనా కార్యదర్శి డాక్టర్ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అన్నమయ్య జిల్లా కొత్తకోట ఖండ చెట్లవారిపల్లి గ్రామంలో గ్రామ వికాస్ ఆధ్వర్యంలో గోశాలతో పాటు ప్రకృతి వ్యవసాయం ప్రారంభించారు. అఖిల భారత కార్యకారిణి సభ్యులు డాక్టర్ శ్రీ దినేష్ కుమార్, శ్రీ తిరుపతయ్య, ఆంధ్ర ప్రాంత గ్రామ వికాస్ సంయోజక్ స్వయం సేవకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


HINDU NAGARA
Telugu Monthly, Volume : 34,Issue :07

Postal Registration No : VJ/152/2023-25, RIN No. 52882/93
Date of Publishing : 28-06-2026, Date of Posting : 06-07-2026, Pages : 16

# మారుతున్న కాలానికి హిందుత్వం

## దేశ విభజన కుట్రలను తిప్పికొట్టే ఏకైక బంధన శక్తి : శ్రీ నందకుమార్





వేదికపై గౌరవనీయ జస్టిస్ శ్రీ ఎ.వి. శేషసాయి (విశ్రాంత న్యాయమూర్తులు) ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, శ్రీ టి. కృష్ణ ప్రసాద్, IPS (రిటైర్డ్)బాపట్ల పార్లమెంట్ సభ్యులు, శ్రీమతి డా॥ యన్. దుర్గా శ్రీలక్ష్మీ ప్రముఖ గైనకాలజిస్టు, శ్రీ జె. నందకుమార్ జాతీయ సంయోజక్, ప్రజ్ఞా ప్రవాహ్, శ్రీ వి.వి సుబ్రహ్మణ్యం పుస్తక అనువాదకులు, శ్రీ పవన్ కుమార్ సాహిత్యనికేతన్, హాజరైన సభికులు

ప్రజ్ఞా భారతి అఖిల భారత సంయోజక్ శ్రీ నందకుమార్ రచించిన “మారుతున్న కాలానికి హిందుత్వం” పుస్తకావిష్కరణ కార్యక్రమం విజయవాడలోని శ్రీ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జూన్ 20న ఘనంగా జరిగింది. శనివారం సాయంత్రం 6.30 గంటలకు నిర్వహించిన ఈ సభకు మేధావులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మారుతున్న కాలానికి అనుగుణంగా హిందుత్వం యొక్క ప్రాసంగికత, భారతీయ ధార్మిక నాగరికత విశిష్టత, బహుళ సాంస్కృతిక దృక్పథం, జాతీయ ఏకత్వంలో హిందుత్వ పాత్ర వంటి అంశాలపై సభలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా

**ఒకవైపు దేశవ్యాప్తంగా హిందుత్వ భావజాలానికి ప్రజల మద్దతు పెరుగుతుండగా, మరోవైపు కొన్ని వర్గాలు దానిని ప్రతికూలంగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో హిందుత్వం అంటే ఏమిటి? అది కేవలం రాజకీయ భావజాలమా లేదా భారతీయ నాగరికత యొక్క సాంస్కృతిక స్వరూపమా? మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో దాని ప్రాసంగికత ఏమిటి? వంటి ప్రశ్నలపై సమాజంలో విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉంది.**

శ్రీ జె. నందకుమార్ మాట్లాడుతూ, వేల ఏళ్ల చరిత్ర, సంప్రదాయాలు, విలువలతో కూడిన భారత నాగరికతకు ఆ బంధన శక్తి ‘హిందుత్వం’ అని అభివర్ణించారు. ఇటీవలి కాలంలో హిందుత్వ భావనపై ప్రణాళికాబద్ధమైన సైద్ధాంతిక దాడులు జరుగుతున్నాయన్నారు. 1916లో సమర్పించిన పరిశోధన పత్రంలో భారతదేశ సాంస్కృతిక ఐక్యతను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రత్యేకంగా ప్రస్తావించారని గుర్తుచేశారు. అలాగే

**కొన్ని వామపక్ష, మతతత్వ, విచ్ఛిన్నకర శక్తులు సమాజంలోని విభజన రేఖలను మరింత లోతుగా చేసే ప్రయత్నం చేస్తున్నాయి. అయితే భారతదేశాన్ని ఒకే నాగరికతా దృక్పథంతో, సాంస్కృతిక బంధంతో అనుసంధానించే హిందుత్వమే అలాంటి విభజన ప్రయత్నాలకు సమర్థమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది.**

నేతాజీ సుభాష్ చంద్రబోస్ కూడా భారతదేశం ఉత్తరం నుంచి దక్షిణం వరకు ఒకే సాంస్కృతిక ఆత్మతో నిండి ఉందని పేర్కొన్నారని చెప్పారు. ఈ మహనీయులు ఏ రాజకీయ సంస్థకు చెందినవారు కాకపోయినా, దేశాన్ని కలిపి ఉంచే శక్తిని స్పష్టంగా గుర్తించారని తెలిపారు. భారతదేశాన్ని సాంస్కృతికంగా ఏకం చేసి ఉంచే శక్తిగా హిందుత్వం ఎదిగిన నేపథ్యంలో భాష, ప్రాంతం, కులం వంటి అంశాల ఆధారంగా దేశాన్ని విభజించాలనుకునే శక్తులకు అది ప్రధాన అడ్డంకిగా మారిందని నందకుమార్ వ్యాఖ్యానించారు. హిందుత్వ అనేది ఆధునిక రాజకీయ నిర్మాణం కాదని, వేల ఏళ్ల సాంస్కృతిక గుర్తింపని స్పష్టం చేశారు. ఒకప్పుడు హిందూ అనే పదాన్ని రాజకీయంగా దూరం పెట్టేందుకు ప్రయత్నించిన వర్గాలు, నేడు ప్రజాభిప్రాయం మారుతున్న నేపథ్యంలో అదే గుర్తింపును స్వీకరించే పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు.

**ఒక దేశ భౌగోళిక సరిహద్దులను సైనిక శక్తి లేదా రాజకీయ వ్యవస్థలు మాత్రమే రక్షించలేవు. దేశ ప్రజలను అంతర్గతంగా ఒకే భావజాలంతో, నాగరికతా స్పృహతో అనుసంధానించే సాంస్కృతిక అంతస్సూత్రమే దాని అసలైన బలం.**

Published by : Tulasi Surya Prakash on behalf of Sahiti Sudha Foundation from Madhavasadan, Kaleswara Rao Road, Governorpet, Vijayawada - 520002 and Printer Chiruvolu Vasu Deva Rao and Printed at : B.S.R. Enterprises, D.No: 32-26-110/6, Narra Gopala Krishnaiah Street, Maruthi Nagar, VIJAYAWADA - 520004, Editor : Chiruvolu Vasu Deva Rao, Cell : 9490923439